
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

బుధవారం 2 ఏప్రిల్ 2025

8న బందారం కథలు పుస్తకావిష్కరణ సభ

- హాజరుకానున్న ప్రముఖ సంపాదకుడు కె.శ్రీనివాస్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

7

సర్వే చేయించారు..పారితోషికం మరిచారు

- కాళ్లరిగేలా తిరుగుతున్న ఎన్యూమరేటర్లు
- రేపుమాపంటున్న అధికారులు
- జిల్లాలో రూ.కోటి బకాయి



దుబ్బాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సర్వేలో నాలుగు పైసలు వస్తాయని నిరుద్యోగులు, విద్యార్థులు ఎంతో ఆశపడ్డారు. ఉత్సాహంగా ప్రభుత్వం చేపట్టిన సర్వేలో పాల్గొని ఇల్లిల్లు తిరుగుతూ వివరాలు సేకరించారు. నిర్ణీత గడువు లోగా లక్ష్యాన్ని పూర్తిచేశారు. అయితే ఇంత కష్టపడిన వారికి ఇప్పటికీ వేతనం చెల్లించలేదు.

జిల్లావ్యాప్తంగా 499 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల్లో సమగ్ర సర్వేను గతేడాది నిర్వహించారు. ఈ సర్వేను అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామకార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లతో పాటు నిరుద్యోగులు చేపట్టారు. వీరంతా ప్రతి ఇంటికి వెళ్లి ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన చేపట్టారు. సమగ్ర సర్వేకు సుమారు 2వేల పైచిలుకు మంది విద్యార్థులను నియమించారు. జిల్లాలో సుమారు 3,216మంది డాటా ఆపరేటర్లు పనిచేశారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లను నియమించారు. వీరిలో ఎన్యూమరేటర్లకు రూ.10వేలు, సూపర్‌వైజర్లకు రూ. 12వేల చొప్పున పారితోషికం అందజేస్తామని తెలిపారు. ఇం టింటా చేసిన సర్వే నివేదికను కంప్యూటరీకరించడానికి ఒక ఫారమ్‌కు రూ.25 చొప్పున చెల్లించడానికి ఆపరేటర్లను నియమించారు. అయితే వీరికి అందాల్సిన వేత నం ఇప్పటికీ ఇవ్వలేదు. దాదాపు రూ.కోటి వరకు చెల్లించాల్సి ఉంది. నాలుగు నెలలుగా నిరుద్యోగులు, విద్యార్థులు తహసీల్దార్, మున్సిపల్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులకు కూడా సరైన సమాచారం లేకపోవడంతో రేపు, మాపు అంటూ వారిని కాళ్లరిగేలా తిప్పుతున్నారు. తాము బిల్లులు చేసినప్పటికీ, ఖజానాలో డబ్బు లేనందున చెక్కులు పాస్‌కావడంలేదని చెబుతున్నారు.

సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిన నిర్మలాజగ్గారెడ్డి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం



కందిలోని రేషన్‌షాపు వద్ద లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని సన్మానించి మొక్కను అందజేస్తున్న కంది తహసీల్దార్

కంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం కందిలోని రేషన్‌షాప్‌లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డిని స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి శాలువాతో సన్మానించి, మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఆరు గ్యారంటీల అమలుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువయ్యిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూలకంటి ఆంజనేయులు, కె.మోతీలాల్‌నాయక్, రుద్రారం ప్రకాశ్, బూడిదకుమార్, సాయిబాబా, శ్రీరామ్, తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ రూ.307

- స్వల్పంగా పెరిగిన కూలీ వేతనం
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి ..
- జిల్లా వ్యాప్తంగా 2.37 లక్షల మంది కూలీలకు ప్రయోజనం



సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. రోజు వారీ దినసరి కూలీ రూ.300 నుంచి రూ.307 కు పెంచారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. 2005లో ప్రారంభమైన ఈ పథకం 2006 నాటికి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అమలులోకి వచ్చింది. ఈ పథకం ద్వారా ఏడాదిలో కూలీలలకు వారి కుటుంబానికి 100 రోజుల పని కల్పించేలా వెసులుబాటు ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 2.37 లక్షల మందికి కూలీలకు లబ్ధి చేకూరనున్నది.

2.37 లక్షల మందికి పైగా ఉపాధి కూలీలు

జిల్లాలో 508 గ్రామపంచాయతీలున్నాయి. 1.36 లక్షల జాబ్ కార్డులో ఉండగా.. అందులో 2.37 లక్షల మం ది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. దాదాపు జిల్లాలో వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు దాదాపు 18 వేలకు పైగా ఉన్నాయి. 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైంది. అప్పుడు కేవలం రూ. 87.50 మాత్రమే చెల్లించేవారు. క్రమంగా పెంచుతూ ఉండడం వల్ల సుమారు 20 ఏళ్లకు రూ. 307కు చేరింది.



ఉపాధి పని చేస్తున్న కూలీలు

ప్రారంభం కానున్న కొత్త పనులు..

ఉపాధిహామీ పథకం 2025-26లో జిల్లావ్యాప్తంగా భూ అభివృద్ధిలో జంగిల్ కటింగ్, భూమి చదును, జల సంరక్షణలో ఇంకుడు గుంతలు, సేద్యం కుం టలు, గుట్టల చుట్టూ కందకాలు తీయడం, పొలాలకు వెళ్లేందుకు రోడ్డు చదును తదితర పనులు ఊపందుకోనున్నాయి.

వేసవి భత్యం అందేనా?

వేసవిలో ఉపాధి కూలీలకు పనులు అధికంగా లభిస్తుంటాయి. గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దినసరి కూలీతో పాటు వేసవి భత్యం చెల్లించేవారు. ఆ సమయంలో 15 నుంచి 30 శాతం వరకు అధికంగా అందేది. మూడేళ్ల నుంచి దీనిని తొలగించారు. పలుగు, పార భత్యాలు కూడా వారానికి ఒకసారి చెల్లించేవారు. దానిని కూడా ఆపివేశారు. దీని వెంటనే పునరుద్ధరించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజు వారీ కూలి రూ.300 నుంచి రూ.307కు పెంచింది. కొలతల ఆధారంగా పనులు చేయాలి. మరికొన్ని రోజుల్లో ఉపాధి పనులు ముమ్మరం కానున్నాయి. ప్రతీ ఒక్కరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాము. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో సాధ్యమైనంత వరకు ఉదయం పూటను తమ పనులు చేసుకోవాలి. కూలీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- జయదేవ్ ఆర్యా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

అందరికీ ఆహార భద్రత

- దేశంలోనే మొదటిసారి సన్న బియ్యం పంపిణీ
- ప్రజాపాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరికీ ఆహార భద్రత కల్పించేందుకే ప్రభుత్వం సన్నబియ్యం పథకం ప్రారంభించిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన హుస్నాబాద్ పట్టణం బుడిగజంగాల కాలనీలోని రేషన్‌షాపులో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే మొదటిసారి ఈ పథకాన్ని ప్రారంభించి తెలంగాణ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. 17263 చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం ప్రథకాన్ని ప్రారంభించామన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఇంటికి చేరకముందే ఇతరులకు విక్రయించే వారని, ఇక నుంచి ఆ పరిస్థితి ఉండబోదన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేసిందని వెల్లడించారు. రాష్ట్రంలో ఏడు లక్షల కోట్ల అప్పులున్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తిరుపతిరెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి పలువురు ఉన్నారు.

సంక్షేమ పథకాలకు ఇబ్బంది రానివ్వం

హుస్నాబాద్‌రూరల్ : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ సంక్షేమ పథకాలకు ఇబ్బంది కలగనివ్వకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. రైతులకు, ఉద్యోగులకు, మహిళలకు సంక్షేమ పథకాలకు ఎక్కడ లోటు లేకుండా చూస్తున్నామన్నారు. జిల్లాలో మొట్టమొదటగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని పోతారం (ఎస్)లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎక్కడైనా అదనంగా తూకం వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నివాసం లేని నిరుపేదలకు ఫేజ్-1, ఫేజ్-2లో మొదటి ప్రాధాన్యంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే విధంగా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి కాలువల కోసం భూములు కోల్పోతున్న రైతులు పెద్ద మనసుతో సహకరించాలని కోరారు. త్వరలో పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్‌హమీద్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బంక చందు, డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, ఆర్డీవో రామ్మూర్తి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌లు కరుణాకర్, విద్యాసాగర్, ఏపీఎం శ్రీనివాస్, బిక్షపతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు వాణి, వీవోఏలు లక్ష్మీ, కనకతార, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గడ్డపోతారం మున్సిపాలిటీలోకి ఆ మూడు పంచాయతీలు?

- శివానగర్, కొడకంచి, నల్తూరు జీపీల విలీనం కోసం ప్రతిపాదనలు
- కొత్త మున్సిపాలిటీగా జిన్నారం?

జిన్నారం, ఏప్రిల్ 1, (ఆంధ్రజ్యోతి) : ఇటీవలే కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటైన జిన్నారం మండలం గడ్డపోతారం పరిధిలోకి మరో మూడు గ్రామా పంచాయతీల(జీపీ) విలీనం జరుగనున్నదనే ప్రచారం జోరుగా సాగుతోంది. జనవరి 28న గడ్డపోతారం మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటన ఆ తరువాత బిల్లు కూడా ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కాజీపల్లి, వావిలాల, మాదారం, లక్ష్మీపతి గూడెం, గ్రామ పంచాయతీలను విలీనం చేశారు. తాజాగా ఈ మున్సిపాలిటీ పరిధిలో శివానగర్, నల్తూరు, కొడకంచి జీపీలను కూడా విలీనం చేయాలనే ప్రతిపాదనలు అధికారులు ప్రభుత్వానికి పంపినట్లు రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతుంది. ఈ మూడు పంచాయతీలు కొత్త మున్సిపాలిటీ గడ్డపోతారంలో చేర్చాలని ముందుగానే ప్రతిపాదనలు వెళ్లినా పలు కారణాలతో చేరలేదు. తాజాగా రాజకీయ సమీకరణలు, నాయకుల ఒత్తిళ్లతో ఈ మూడు జీపీలు గడ్డపోతారంలో చేరటం ఇక లాంఛనమే అనే ప్రచారం జరుగుతుంది. ఇక మండల కేంద్రం జిన్నారం కేంద్రంగా ఇప్పటివరకు 10 జీపీలతో మండల పరిషత్, 5 ఎంపీటీసీ స్థానాలు ఉండే విధంగా పరిధి, ఓటరు జాబితాను అధికారులు ఖరారు చేశారు. తాజా పరిణామాలతో మండల పరిషత్‌లో జీపీల సంఖ్య ఏడుకు పరిమితం కాగా, ఎంపీటీసీల సంఖ్య 3 లేదా 4 వరకు తగ్గి ఎంపీపీ, మండల కేంద్రం పాత్ర పరిమితం కానున్నది.

జీహెచ్‌ఎంసీలో విలీనంపై ప్రచారం

కొత్త మున్సిపాలిటీలో మరో మూడు జీపీల విలీనంతో పాటు మొత్తం ఉమ్మడి జిన్నారం మండలం జీహెచ్‌ఎంసీలో విలీనం జరుగనున్నదనే మరో ప్రచారం ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది. గడ్డపోతారం కేంద్రంగా ఏర్పాటైన మున్సిపాలిటీలో 8 జీపీలు, జిన్నారం కేంద్రంగా 7జీపీలతో మరో నూతన మున్సిపాలిటీ ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్నట్లు నాయకులు, పలువురు అధికారులు అంటున్నారు. ప్రభుత్వం ప్రస్తుత జీహెచ్‌ఎంసీని పలు కొత్త జోన్లుగా విభజించాలనే ప్రతిపాదనలతో ఉండగా నగరానికి సమీప ప్రాం తాలను కొత్త జోన్లలో చేర్చుతారని అంటున్నారు. దీంతో జిన్నారం, గుమ్మడిదల మండలం మొత్తం జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు ప్రభుత్వానికి నియోజకవర్గ ముఖ్య నాయకులు తమ ప్రతిపాదనలు అందజేశారనే ప్రచారం నెలకొన్నది. దీంతో మున్సిపాలిటీలు, జీపీలు, జీహెచ్ఎంసీ పరిధిలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

కుల బహిష్కరణపై ఫిర్యాదు

మద్దూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన పచ్చడి తయారు చేసుకునేందుకు బీరప్పగుడిలోని రానివ్వకుండా ఆలయానికి తాళం వేయడంతో పాటు కులబహిష్కరణ చేయడంపై మండలంలోని సలాఖ్‌పూర్ కుర్మ సంఘం పెద్దమనిషి రాసూరి రాములు మంగళవారం మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉగాది రోజున బీరప్పగుడి తాళం తీయాలని పూజారిని కోరినా తాళం ఇవ్వకుండా లోనికి రానిచ్చేది లేదంటూ చెప్పారన్నారు. గతంలో గ్రామానికి చెందిన ఒకరు ఎకరం భూమిని గుడికి దానంగా ఇచ్చారన్నారు. ఆ భూమిని కుర్మ సంఘం పేర నమోదు చేయకుండా గ్రామానికి చెందిన ఇద్దరు తమ పేర నమోదు చేసుకున్నారని, ఈ విషయాన్ని ప్రశ్నించినందుకు గుడిలోకి రానివ్వకుండా కుల బహిష్కరణ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై న్యాయం చేయాలని కోరుతూ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఎస్.స్వాతిరెడ్డి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే న్యాయం, చట్టాలు, బాలల హక్కుల పైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఎస్.స్వాతిరెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం సిద్దిపేటరూరల్ మండలం చింతమడక ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల చట్టాలు, హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ పౌరుడి హక్కుల పరిరక్షణకు భారత రాజ్యాంగంలో పటిష్టమైన చట్టాలున్నాయన్నారు. ఇటీవల కాలంలో పోక్సో కేసులు పెరుగుతున్నాయన్నారు. విద్యార్థులు జీవితంలో సక్సెస్ కావాలంటే తమకు నచ్చిన రంగంలో నైపుణ్యాన్ని సాధించాలని సూచించారు. విద్యార్థులకు చట్టాల గురించి, వారి హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ ఎస్ఐ గుడ అపూర్వ రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవిలత, అడ్వకేట్ ఆర్.అరవింద్, సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఎస్.స్వాతిరెడ్డి

నీటి సమస్య తీర్చాలని మహిళల ఆందోళన

● ఖాళీ బిందెలతో పంచాయతీ ఎదుట నిరసన



కంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కందిలో నీటి సమస్య రోజురోజుకు తీవ్రతరం అవుతున్నది. ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటడం, పంచాయతీ బోర్లు పనిచేయకపోవడంతో పంచాయతీ సిబ్బంది కొన్నిరోజులుగా ట్యాంకర్లతో నీటి పంపిణీ చేస్తున్నారు. అయినా సరిపోకపోవడంతో నీటి సమస్య తీర్చాలని మహిళలు మంగళవారం గ్రామపంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కనీసం బోరుల మరమ్మతులు కూడా చేయించడం లేదని వాపోయారు. వెంటనే నీటి సమస్య తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

తాటిచెట్లకు మొగిపురుగు ఎఫెక్ట్

● మోడువారుతున్న వైనం

● ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు

అక్కన్నపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మొగిపురుగు సోకడంతో తాటి చెట్లు మోడువారుతున్నాయి. దీంతో అవి కనుమరుగవుతుండడంతో గీత కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. మొగిపురుగును అరికట్టేందుకు క్రిమిసంహారక మందులు లేకపోవడంతో గీత కార్మికులు ఏం చేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్నారు. పలుచోట్ల తాటి చెట్లు మొగిపురుగు బారిన పడడంతో భూ యజమానులు కొట్టివేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాటిచెట్లలో పలు రకాలు..

తాళ్లల్లో పోద్దాళ్లు, పరుపు దాళ్లు, పండుతాళ్లు మూడు రకాలుంటాయి. పోద్దాళ్లు డిసెంబర్ చివరివారం నుంచి మార్చి చివరి వరకు మూడు నెలల పాటు పారుతాయి. ఆ తరువాత పరుపు దాళ్లు మరో మూడు నెలలు, అనంతరం వాటిలో కొన్ని మరో మూడు నెలలు పండుదాళ్లగా పారుతాయి. 9 నెలల పాటు గీత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. చెట్లు తక్కువగా ఉండడంతో తక్కువ మందికే ఉపాధి దొరుకుతుంది.



మూడు నెలలు ఖాళీగానే..

తాటిచెట్లకు మొగిపురుగు సోకడంతో గీత కార్మికులు ఉపాధి లేక కూలీకి వెళ్లాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో దాదాపు 30 వేల మంది గీత కార్మికులు ఉన్నారు. 18 వేల మంది కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి గీత కార్మికుల ఉపాధి కోసం కృషి చేయాలని పలువురు గీత కార్మికులు కోరుతున్నారు.

ఉపాధి కల్పించాలి..



తాటిచెట్లకు మొగిపురుగు సోకి చెట్లు చనిపోతుండడంతో మేము ఉపాధి కోల్పోతున్నాం. తాటిచెట్ల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ప్రభుత్వం చెట్లను నాటించడంతోపాటు గీతకార్మికులకు ఉపాధి కల్పించాలి.

- వెంకటేష్‌గౌడ్, గీత కార్మికుడు

రుణాలివ్వాలి..



గీత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలి. 50 సంవత్సరాలు దాటిన ప్రతి గీత కార్మికుడికి పెన్షన్ ఇవ్వాలి. గీత కార్మికులకు ప్రభుత్వం ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

- మల్లేశం గౌడ్, గీత కార్మికుడు

56వ రోజుకు రిలే దీక్షలు

జిన్నారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా గుమ్మడిదలలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 56వ రోజుకు చేరాయి. మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రిలే దీక్షల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు

ఎంపీడీవో కార్యాలయం ప్రారంభించరా..?

● మూడునెలలవుతున్నా పట్టించుకోని వైనం



మాసాయిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలో నూతనంగా ఏర్పాటవుతున్న ఎంపీడీవో కార్యాలయం అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. నూతనంగా ఏర్పడిన మాసాయిపేట మండలానికి మూడునెలల క్రితం ఎంపీడీవో కార్యాలయం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సంబంధిత అధికారులు ఆగమేఘాల మీద పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఎంపీడీవో కార్యాలయంగా మారుస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. బోర్డులు ఏర్పాటుచేసి సుమారు మూడునెలలు గడుస్తున్నా నేటికీ మండల అభివృద్ధి అధికారి కానీ, సిబ్బంది కానీ మండల ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు, నాయకులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని వెంటనే ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

● పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదమని ఆరోపణ
● న్యాయం చేయాలంటూ తోటి కార్మికుల నిరసన


శ్రీయాన్ పాలిమార్ పరిశ్రమ వద్ద పోలీసులతో మట్లాడుతున్న కార్మికులు


రఘునాథ్ సింగ్ (ఫైల్)

మనోహరాబాద్ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కొండాపూర్ పారిశ్రామిక వాడలోని శ్రీయాన్ పాలిమార్ పరిశ్రమలో మధ్యప్రదేశ్ రాష్ట్రం అనుపూర్ జిల్లా బెలియ గ్రామానికి చెందిన రఘునాథ్ సింగ్ (21) ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులు నిర్వహిస్తుండగా మిషన్‌కు చెందిన విద్యుత్ వైర్ తగలడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడిని పరిశ్రమ సిబ్బంది వెంటనే మేడ్చల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మిషన్ ఇన్‌చార్జి గురువ క్రిష్ణ, ఇన్‌చార్జి మెతుకుల రవి నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగిందని మృతుడి సోదరుడు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు రఘునాథ్‌సింగ్ కుటుంబానికి న్యాయం చేయ్యాలని డిమాండ్ చేస్తూ పరిశ్రమ ఎదుట నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సుభాష్‌గౌడ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశ్రమ యాజమన్యంతో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హమీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం రఘునాథ్ సింగ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు దినేష్ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై ఆవేదన

పరిశ్రమలో ఎలాంటి భద్రతా సౌకర్యాలు లేవని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మహిళా కార్మికులకు సరైన బత్‌రూమ్‌లు లేవని, పనిలో ఇతర భద్రతా పనిముట్లు లేవని తెలిపారు. గతంలో కూడా అనేక సార్లు పరిశ్రమలో ప్రమాదాలు జరిగాయని, పరిశ్రమ యాజమాన్యం కార్మికులను నిర్లక్ష్యం చేస్తుందని తమ గోడును వెల్లబోసుకున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ విద్యార్థిని చికిత్సపొందుతూ మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి బీరంగూడలో నివాసముంటున్న శిరీష(22) ఎంబీఏ చదువుతుంది.. సోదరుడు శ్రీనాథ్ కొనుగోలు చేసిన వాహనానికి లింగంపల్లి కూడలిలోని గండమ్మ ఆలయంలో పూజ చేయించడానికి శిరీష, ఆమె తండ్రి శ్రీశైలం స్కూటీపై సోమవారం రాత్రి సమయంలో బీరంగూడ నుంచి వెళ్తున్నారు. మార్గమధ్యలో మయూరినగర్ వద్ద గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో తండ్రికుమార్తెలు కిందపడి గాయాలపాలయ్యారు. శిరీషకు తలకు బలమైన గాయంకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. సోదరుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి యువకుడు..

మెదక్ అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ రామంతాపూర్‌కు చెందిన మహ్మద్ హఫీజ్(24) రంజాన్ పండుగ కోసం మెదక్‌లోని బాబాకాలనీలో నివాసముంటున్న మేన మామ ఇంటికి వచ్చాడు. హఫీజ్ బావ రజాక్‌తో కలిసి స్థానిక గాంధీనగర్‌లోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు హఫీజ్ నీట మునిగిపోవడంతో వెలికి తీసి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బావ రజాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజ్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ..

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో పలు దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్టు చేశారు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా శాలిపేటకు చెందిన గుర్రం అఖిల్ (32) మూడు రోజుల క్రితం పొన్నాల వైన్స్ పైకప్పు విప్పి లోపలికి ప్రవేశించి 30 వేల నగదు, కొన్ని మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న త్రీ టౌన్ పోలీసులు, సెంట్రల్ క్రైమ్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా 2012 నుంచి దొంగతనాలకు పాల్పడతున్నట్లు తెలిసింది. నిందితుడు గతంలో కూడా రాజమండ్రి సికింద్రాబాద్ మేడ్చల్, బషీరాబాద్ ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుడి పట్టుకోవడానికి సహకరించిన త్రీటౌన్ సిబ్బందిని సీఐ అభినందించారు.

ఇంటి ముందు నిలిపిన ఆటో చోరీ

కంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో చోరీకి గురైన సంఘటన కంది మండలకేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా నివాసముండే అంజాద్ టీఎస్ 15 యూఏ 7576 నంబరుగల టాటాఏసీ గూడ్స్ వెహికిల్‌ను టెంట్‌హౌస్ సామాన్లు సరఫరా కోసం వినియోగిస్తున్నాడు. కొత్త కందిలో సోమవారం రాత్రి తన ఇంటి ముందు ఆటోను పార్క్ చేశాడు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు లేచి చూసిన అంజాద్‌కు తన ఆటో కనిపించకపోవడంతో సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీవీఎస్ ఎక్సల్..

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : టీవీఎస్ ఎక్సల్ వాహనం చోరీకి గురైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన జంగం రాజు తన ఇంటి ముందు ఎక్సల్ వాహనాన్ని పార్క్ చేయగా దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీసీ పుటేజ్‌ను పరిశీలించి గుర్తుతెలియని వ్యక్తి వాహనాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించారు.

మెడలోని బంగారు ఆభరణాలు చోరీ

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ మెడలోని బంగారు ఆభరణాలు లాక్కెళ్లిన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురంలో నివాసం ఉంటున్న ఆరోగ్యమ్మ సోమవారం రాత్రి అల్లుడు సూర్యతేజ స్కూటీపై ప్రయాణం చేస్తున్నది. ఎంఐజీ కాలనీలో స్పీడ్ బ్రేకర్ వద్ద వెనుకనుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీని ఢీకొట్టారు. దీంతో ఆరోగమ్మతోపాటు ఆమె అల్లుడు కిందపడ్డారు. వెంటనే వారి కళ్లల్లో కారం చల్లి ఆమె మెడలో ఉన్న 2.5తులాల బంగారం ఆభరణాలను లాక్కెళ్లారు. ఆరోగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యం.. పుస్తకానికి దూరం

● మనిషి జీవన గమనం మార్చేది పుస్తకం
● పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలి

నేడు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం





కొండపాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పుస్తకమనేది అక్షరాలతో పాటు మానవ సంబంధాలను తనలో అందంగా దాచుకున్న తరగని గని. పదాలతో పలకరిస్తూ.. ప్రపంచాన్ని మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. కథలు, కామిక్‌లు ఇలా దేనిపై చిన్నారికి ఆసక్తి ఉంటే తల్లిదండ్రులు దానికి సంబంధించి ఓ పుస్తకాన్ని వారి ముందు ఉంచాలి. మనిషి తన జీవన గమనాన్ని మార్చుకోవడానికి పుస్తకానికి మించిన సాధనం మరొకటి లేదని వారికి అర్థమయ్యేలా వివరించాలి. ఆధునిక సమాజంలో నేటితరాన్ని పుస్తక పఠనానికి దగ్గర చేయండి. అదే సమాజానికి ఇచ్చే విలువైన కానుక. మానవ మస్తిష్కాలను రగిలించి శక్తిమంతులను చేసేది పుస్తకం.. అలాంటి పుస్తకం రోజుకో కొత్త యాప్స్‌తో పుట్టుకొస్తున్న చరవాణి ప్రపంచంలో మనిషికి దూరమవుతోంది. భావిపౌరులైన నేటి బాల్యం పొరపాటుగానైనా పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవడం లేదని మేధావులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు, గురువులు పుస్తకాల విలువను నేటి తరానికి తెలియజెప్పాలి. ఆ అలవాటును వారి దరికి చేర్చాలి. నేటి చిన్నారులు ఆధునిక అలవాట్లతో బంధీలవుతున్నారు.

బహుమతిగా ఇవ్వాలి...

పిల్లలకు చిన్ననాటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలి. ఏదైనా సందర్భం వస్తే పుస్తకాలు బహుమతిగా ఇచ్చి పఠనంపై దృష్టి మరల్చేలా చూడాలి. చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి కథల పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. వాటిలోని నీతిని వారికి వివరించాలి. అప్పుడప్పుడు గ్రంథాలయాలకు తీసుకెళ్లి పాఠకుల ఆసక్తిని గమనింపజేయాలి. మంచి పుస్తకాల గురించి పిల్లలతో విస్తృతంగా చర్చించాలి. ఇంటి ప్రధాన హాల్‌లో, పిల్లల గదిలో పుస్తకాలు ఉండేలా చూడాలి. పుట్టిన రోజున ఓ మంచి పుస్తకం ఇవ్వాలి. ఇంటిలో ఓ చిన్నపాటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి.

చరవాణి, టెలివిజన్‌పై ఆసక్తి..

నేటి చిన్నారులు టీవీలు, చరవాణులకు అతుక్కుపోయి కామిక్ కథలు, హింసను ప్రేరేపించే దృశ్యాలను ఎక్కువగా చూస్తున్నారు. పలు ఆంగ్ల చిత్రాల సన్నివేశాలకూ ప్రభావితమైన వారున్నారు. ఆదేపనిగా చరవాణికి అతుక్కుపోయి పుస్తకం పట్టని వారే ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి అలవాట్లు ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను ఆసక్తి ఉన్న పుస్తకాల పఠనం వైపు మళ్లించాల్సిన ఆవశ్యకతను తల్లిదండ్రులు గుర్తించాలి.

కారణాలివే..

- తల్లిదండ్రులు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించకపోవడం. చరవాణి, కంప్యూటర్ ఆటలు, సినిమాలు, సామాజిక మాధ్యమాలకు అలవాటు పడటం.
- సరైన పుస్తకాన్ని పిల్లలు ఎంపిక చేసుకోకపోవడం. చదవడంలో పిల్లలకున్న ఇబ్బందులు గుర్తించకపోవడం.
- ఆటలపైనే అమితాసక్తి ఉండటం. ఒక చోట నిశ్చింతగా కూర్చోలేకపోవడం.

పుస్తక పఠనంతో లాభాలు..

పుస్తక పఠనంతో విద్యార్థులతో పాటు పెద్దలకు చాలా లాభాలున్నాయి. ఉన్నత వ్యక్తిత్వంతో పాటు సానుకూల దృక్పథం అలవడుతుంది. స్వయం ప్రేరణ, క్రమశిక్షణ, సామాజిక నైపుణ్యాలు మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. సందర్భమేదైనా పిల్లలకు మంచి పుస్తకాలు బహుమతిగా ఇవ్వడం వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో భాగమనే విషయం మరువొద్దు.


పుస్తకావిష్కరణ కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న మరసం ప్రతినిధులు

8న బందారం కథలు పుస్తకావిష్కరణ సభ

● హాజరుకానున్న ప్రముఖ సంపాదకుడు కె.శ్రీనివాస్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి రచించిన కథా సంపుటి బందారం కథలు పుస్తకం ఆవిష్కరణ సభ ఈ నెల 8న సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ పత్రికా సంపాదకుడు కె. శ్రీనివాస్, ఆత్మీయ అతిథిగా ప్రముఖ గాయకుడు, కవి, శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె. రంగాచార్య, ప్రధాన కార్యదర్శి సిద్దంకి యాదగిరి, ప్రముఖ రచయిత పప్పుల రాజిరెడ్డి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నాల బాలయ్య, గౌరవ అధ్యక్షుడు తోట అశోక్, తెలంగాణ వికాస సమితి అధ్యక్షుడు నందిని భగవాన్ రెడ్డి, కవి గంబీర్ రావుపేట యాదగిరి, మరసం ఉపాధ్యక్షుడు అలాజ్‌పూర్ శ్రీనివాస్, కవి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు

● కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలి వచ్చిన మల్లయోధులు


బీబీపేట్‌లో జరిగిన కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

నారాయణఖేడ్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలను పురస్కరించుకొని నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీలను వీక్షించేందుకు భారీ ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో పాటు నారాయణఖేడ్ పరిసర గ్రామాలకు చెందిన మల్లయోధులు పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● కల్హేర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బీబీపేట్ గ్రామంలో ఉగాది పండగ సందర్భంగా మంగళవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన మల్లయోధులు పాల్గొని పోటీలను రంజింపజేశారు. ఆఖరు కుస్తీ పోటీలో తలపడ్డ మల్లయోధుల్లో మహారాష్ట్రలోని అంతాపూర్‌కు చెందిన గంగారాం అనే మల్లయోధుడు విజేత నిలువగా ఆయనకు నిర్వహకులు రూ. 5000 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటి మాజీ చైర్మన్ గుండు నరేందర్, బీజేపి మండల అధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి, నాయకులు బందారు సాయిలు, సంతోష్‌రెడ్డి, గుండు సురేష్, విటల్‌రెడ్డి, గూల రవి, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికని వెళ్లిన మహిళ అదృశ్యం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన గజ్వేల్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గ్రామానికి చెందిన శీలం జ్యోతి(35) అనారోగ్యంతో బాధపడుతున్నది. దీంతో భర్త సత్యనారాయణతో కలిసి సోమవారం ఉదయం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. సెలైన్ బాటిల్ ఎక్కించాలని డాక్టర్లు చెప్పడంతో సెలైన్ పూర్తయినా తరువాత ఇంటికి రా అని భర్త ఆమెతో చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికి భార్య రాకపోవడంతో పాటు కాల్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. బంధువులు, చుట్టుపక్కల వద్ద వెతికాన ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం భర్త గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి అక్రమ రవాణా

● వాహనం స్వాధీనం, కేసు నమోదు

జిన్నారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమి నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు. జిన్నారం సర్వే నెంబరు 1 హెచ్ఎండీఏ భూమి నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని హెచ్ఎండీఏ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వ భూముల నుంచి మట్టి తవ్వకాలు, ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

● విధులను సక్రమంగా నిర్వహించాలి
● సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్


జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పంకజ్ పరితోష్

జహీరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : పోలీసులు విధులను సక్రమంగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పస్తాపూర్‌లో గల రూరల్, పట్టణ పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనఖీ చేశారు. ఎక్కువగా నమోదవుతున్న కేసులు, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు. జహీరాబాద్ ప్రాంతం కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల నిర్వహణలో ఏమైన సందేహాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. పలు రికార్డులను తనిఖీలు చేసి, క్రైంరేటును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, ఎస్ఐలు కాశీనాథ్, ప్రసాదరావు ఉన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

కోహీర్, ఏప్రిల్ 1: (ఆంధ్రజ్యోతి) జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కోహీర్‌లోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను ఎస్పీ పరిశీలించి పలు అంశాల పైన పోలీస్ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కేసుల నమోదు విషయంలో కూడా పోలీసులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, జహీరాబాద్ సీఐ శివలింగం, కోహీర్ ఎస్ఐ గోపతి సతీష్‌వర్మ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు

ఐపీఎల్ బెట్టింగ్‌లపై నిఘా

● ఆన్‌లైన్ గేమింగ్‌కు యువత దూరంగా ఉండాలి
● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసు నిఘా పెట్టినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్, నిషేధిత యాప్స్, ప్లే కార్డ్స్, గేమింగ్ యాప్‌లు, ఐపీఎల్ తదితర వాటికి దూరంగా ఉండాలని సూచించారు. యాప్స్‌కు బానిసలుగా మారి, అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకొవద్దన్నారు. యాప్స్ డౌన్‌లోడ్ ద్వారా వ్యక్తిగత సమాచారం, అకౌంట్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లే అవకాశం ఉందన్నారు. పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. బెట్టింగ్‌లపై పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సినీ నిర్మాత మురళీకృష్ణపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు ఆదేశం


జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబుకు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పుల్‌కల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దాడికి పాల్పడిన సినీ నిర్మాత మేడికొండ వెంకటమురళీకృష్ణపై చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబును పలువురు కోరారు. ఈ మేరకు బాధితుడు పల్లె సంజీవయ్యతో కలిసి తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్ అధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు వీరశెట్టి, ఇబ్రహీం, దాసరి రవీందర్ హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలోని గొంగ్లూరు గ్రామంలో జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, దళిత నాయకుడు పల్లె సంజీవయ్య, ఆయన తనయుడు క్రాంతి, సోదరుడు బాలయ్యలపై వెంకటమురళీకృష్ణతోపాటు ఆయన అనుచరులు ఇప్పల వాసు, నత్తల భరత్‌కుమార్, వడ్ల మాధవచారి, శేక్ మాలిక్, వడ్డెర సురేంద్ర, రవి హత్యాయత్నం చేశారన్నారు. సంఘటన జరిగి పది రోజులు గడుస్తున్నప్పటికీ నిందితులపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలయ్యారంటూ ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్పందించిన ఎస్సీ కమిషన్ డైరెక్టర్ వెంటనే జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. దళితులపై నిందితులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ గిడ్డంగుల నుంచి అక్రమంగా బియ్యం తరలింపు

● పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ 70 బస్తాల పీడీఎస్ బియ్యం
● సెలవులు కావడంతో అందుబాటులో లేని సీడబ్ల్యుసీ మేనేజర్



మెదక్, 1 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) కంచె చేనుమేసిన చందంగా పీడీఎస్ బియ్యం నిల్వలు భద్రపరిచే సెంట్రల్ వేర్ హౌస్ (సీడబ్ల్యూసీ) గిడ్డంగుల నుంచే బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలిస్తున్న వైనం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. వరస సెలవులు రావడంతో గోదాము కార్యాలయంలో ఉన్నతాధికారులు లేకపోవడం, అక్రమార్కులకు సులభతరమమైంది. పట్టణ శివార్లలోని హౌజింగ్ బోర్డు కాలనీ వద్ద మెదక్- రామాయంపేట రహదారి ప్రక్కనే సీడబ్ల్యూసీ గోదాం ఉంటుంది. ఈ గిడ్డంగులను ఎఫ్‌సీఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సంస్థ అద్దెకు తీసుకుని రైస్ మిల్లులకు ప్రొక్యూర్ చేసిన బియ్యాన్ని నిల్వ చేస్తుంది. బియ్యం నిల్వలు చెడిపోకండా, ఎలకలు కొట్టకండా కాపాడాల్సిన బాధ్యత సీడబ్ల్యూసీ సంస్థదే. పైగా ఈ గోదాంలకు గట్టి కాపలా ఉంటుంది. గేటు లోపలికి బియ్యం లోడ్‌ల వాహనాలు రావాలన్నా, అనుమతి తప్పనిసరి, అదే విధంగా రైస్ మిల్లర్లు తెచ్చే బియ్యం నాణ్యత లేనివైనా తిరిగి పంపడానికి రిజక్ట్ చేసినట్లు సర్టిఫికెట్ తప్పనిసరి. ఇంత కట్టుదిట్టమైన చెర్యలు చేపడుతున్నా.. ఆదివారం గిడ్డంగి గేటు నుంచి ఒక డీసీఎం వాహనంలో సంతోష్ అనే వ్యక్తి 70 బస్తాల దొడ్డు బియ్యం తరలిస్తుండగా, అక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్న పట్టణ పోలీసులకు పట్టుబడ్డాడు. సరైన కాగితాలు చూపకపోవడంతో వాహనంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సీడబ్ల్యూసీ డీఎం కోటేశ్వరావును సంప్రదించడానికి యత్నించగా, అందుబాటులోకి రాలేదు.

మల్లన్నా.. సొమ్ము రికవరీ చేసేదెవరన్నా?

- నిబంధనలు పాటించకుండా హిమాన్ష్ సీఆర్ఎం సర్వీసెస్‌కు డబ్బు చెల్లించిన ఆలయ అధికారులు
- రూ.28 లక్షల మేర డబ్బు స్వాహా!
- 'హిమాన్ష్' నిర్వాకంతో 20 నెలల కాలం ప్రయోజనాలు కోల్పోయిన సిబ్బంది
- పోలీసులకు ఫిర్యాదు
- విచారణలో జాప్యంపై అనుమానాలు



చేర్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలకు సంబంధించి రూ.28 లక్షల మేర జీఎస్టీ, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చెల్లించకుండా స్వాహాచేసిన హిమాన్ష్ సీఆర్ఎం సర్వీసెస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లేబర్, ఐటీ యాక్ట్‌ను తుంగలో తొక్కుతూ కేంద్రప్రభుత్వానికే టోకరా ఇచ్చి తప్పుదోవ పట్టించడమే కాకుండా. 30మంది సిబ్బందికి నష్టం చేకూర్చిన విషయమైనప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు గాలికి

మల్లన్న ఆలయంలో మ్యాన్ పవర్ సరఫరా నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన హిమాన్ష్ సీఆర్ఎం సర్వీసెస్‌తో ఆలయాధికారులు సెప్టెంబరు-2023 నుంచి ఆగస్టు-2025 వరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న 30మంది సిబ్బందికి ప్రతి నెలా వేతనాల డబ్బును హిమాన్ష్ సర్వీసెస్‌కు చెల్లిస్తున్నారు. అందుకు ఏజెన్సీ నిర్వాహకుడు ఆలయాధికారులు చెల్లించిన మొత్తంలో నుంచి కేంద్రప్రభుత్వానికి ప్రతి నెలా 18శాతం జీఎస్టీతో పాటు 30మంది సిబ్బంది పేరిట 13శాతం ఈపీఎఫ్, 3.25శాతం చొప్పున ఈఎస్ఐ చెల్లించాలి. కానీ 2003-జూలై నుంచి జనవరి-2025వరకు ఈపీఎఫ్ డబ్బులు రూ.11,88,800, ఈఎస్ఐ డబ్బులు రూ.2,96,564, అలాగే జీఎస్టీ డబ్బులు రూ.14.11లక్షలు చెల్లించలేదు. ఒక్కనెల డబ్బులు చెల్లించకపోయినా ఏజెన్సీకి చెల్లింపులు నిలుపుదల చేయాల్సిన నిబంధన ఉన్నప్పటికీ తుంగలోతొక్కిన ఆలయాధికారులు ఆలస్యంగా తేరుకుని సిబ్బందికి వేతనాలు నిలిపివేయడంతో ఏజెన్సీ నిర్వాహకుడు దిగివచ్చి సంప్రదింపులు జరిపారు. కానీ నేటికీ బకాయి చెల్లింపులు చేయలేదు.

డోలాయమానంలో అధికారులు

ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చెల్లించకుండా తమకు అన్యాయం చేశారని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, జీఎస్టీ డబ్బులు చెల్లించక సొంతానికి వాడుకుని నష్టం చేశారని పేర్కొంటూ ఆలయాధికారులు కొద్దిరోజుల క్రితం ఏజెన్సీపై చర్యల నిమిత్తం కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఆలయాధికారులను పలు అంశాలపై వివరణ కోరారు. ఒక్కనెల వేతనాలు చెల్లించకపోయినా ఏజెన్సీకి మళ్లీ డబ్బులు ఎందుకు చెల్లించారని, ఇతరత్రా ప్రశ్నలు సంధించారు. దీంతో ఆలయాధికారులు డోలాయమానంలో పడి తలలుపట్టుకుంటున్నారు.

ఎవరి వాదనలు వారివే..

పోలీసులకు, ఆలయవర్గాల మధ్య జాతర సమయంలో భోజన బిల్లుల చెల్లింపు, దర్శనం విషయాల్లో పలు విభేదాలు తలెత్తి అవాంతరం పెరిగిన క్రమంలో హిమాన్ష్ ఏజెన్సీ వ్యవహారంపై ఎవరికి వారుగా రకరకాల వాదనలు వినిపిస్తున్నారు. ఈ క్రమంలో తాము కోరిన వివరాలిస్తే విచారణ ముమ్మరం చేసి ఏజెన్సీపై తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నప్పటికీ, వివరాలిస్తే తమంతట తామే ఇరుక్కుంటామని ఆలయాధికారులు వెనుకంజవేస్తున్నారు.

రికవరీ బాధ్యత ఎవరిదో?

20నెలలపాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ ప్రయోజనం కోల్పోయిన తమకెలా న్యాయం జరుగుతుందని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు. ఆలయాధికారులు పోలీసులతో పాటు జిల్లా కలెక్టర్, జీఎస్టీ అధికారులకు కూడా లేఖ రాసినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. దీంతో ఆయా పరిణామాల క్రమంలో హిమాన్ష్ ఏజెన్సీ నుంచి జీఎస్టీతో పాటు సిబ్బంది ఈఎస్ఐ, ఈపీఎఫ్ డబ్బులు రికవరీకి ఎవరు చొరవ తీసుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వివరాలు కోరాం.. ఇంకా ఇవ్వలేదు

హిమాన్ష్ ఏజెన్సీపై చర్యల నిమిత్తం ఆలయాధికారులు, సిబ్బంది ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టాం. అందుకు పలు వివరాలు కావాలని ఆలయాధికారులను కోరాం. కానీ ఇప్పటికీ ఇవ్వలేదు. ఇచ్చిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటాం.

\- రాజు, కొమురవెల్లి ఎస్ఐ

వివరాలు అందజేస్తాం

జీఎస్టీ, ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు రూ.28 లక్షలమేర సొంతానికి వాడుకున్న హిమాన్ష్ సర్వీసెస్‌పై చర్యల నిమిత్తం పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు కోరిన వివరాల లేఖను పరిశీలించి నేడో, రేపో వారికి అందజేస్తాం. ఇక నుంచి మరో ఏజెన్సీ ద్వారా సిబ్బందికి వేతనాలు అందించేలా చర్యలు తీసుకుంటాం.

\- రామాంజనేయులు, ఆలయ ఈవో

అంబులెన్స్‌లో ప్రసవం



శిశువును కుటుంబీకులకు అందజేస్తున్న 108 సిబ్బంది

దౌల్తాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలోనే పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన ఓ మహిళ రెండో కాన్పు కోసం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ భాను, పైలెట్ నర్సింహులు మహిళకు ప్రసవం చేయగా పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండటంతో కుటుంబీకులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నిర్లక్ష్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



గజ్వేల్ ఆసుపత్రి ఆర్ఎంవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎల్లయ్య

గజ్వేల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిపై చర్య తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రి ఆర్ఎంవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ... జిల్లా ఆసుపత్రిలో వైద్యులు ఉదయం 10 గంటలు అయినా రావడం లేదని, ఎమర్జెన్సీలో డాక్టర్లు, నర్సులు సరిగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేదలకు సరైన వైద్య సేవలు అందడం లేదని, డాక్టర్లు, నర్సింగ్, హౌస్ కీపింగ్ సిబ్బందితో బెదిరింపులకు దిగుతున్నారన్నారు. తాజాగా ఆర్ శ్రీనివాస్ అనే పేషంట్‌ను ఆసుపత్రికి తీసుకువస్తే హౌజ్ కీపింగ్ సిబ్బంది అడ్డుకుని ఓపీలోకి తీసుకువెళ్లాలని బెదిరించారని ఆరోపించారు. రోగులను పట్టించుకోని నర్సులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆసుపత్రి ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయనవెంట సీపీఎం నాయకులు ఉన్నారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్ట్

మద్దూరు/చేర్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల వద్దకు ధర్నా కోసం వెళుతున్నారన్న ముందస్తు సమాచారం మేరకు సీపీఎం మండల నాయకులను మద్దూరు పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ... అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టామని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో మద్దూరు, దూళిమిట్ట సీపీఎం మండల కార్యదర్శులు ఎండీ షఫీ, పోతిరెడ్డి రాజలింగం ఉన్నారు. అదేవిధంగా చేర్యాలలో పోలీసులు సీపీఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్ మావో, పార్టీ పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, రేపాక కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు మిరుదొడ్డిలో రక్తదాన శిబిరం

మిరుదొడ్డి,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో బుధవారం నైపుణ్య ఆర్గనైజేషన్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆర్గనైజేషన్ యువజన విభాగం అధ్యక్షుడు రమేష్, ఐలయ్య తెలిపారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. రక్తదాన శిబిరంలో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'సన్నబియ్యంలో దొడ్డువి కలుపుతున్నారు'

అక్కన్నపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యంలో దొడ్డు బియ్యం కలిపి పంపిణీ చేస్తుందని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం అక్కన్నపేటలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించగా అందులో దొడ్డు బియ్యం కలిసి వచ్చాయని చూపించారు. కేంద్రం ఉచితంగా ఇచ్చే ఐదు కిలోల బియ్యాన్ని తామే పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదని మండిపడ్డారు. సన్న బియ్యం పేరుతో ప్రభుత్వం అవినీతికి పాల్పడుతుందని ఆరోపించారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్



జిల్లాజడ్జి సాయి రమాదేవితో చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరమల్లయ్య తదితరులు

చేర్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా ఎన్నికైన చేర్యాల బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయాధికారి రమాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరెళ్ల వీరమల్లయ్య, ఉపాధ్యక్షుడు కాటం సురేందర్, ప్రధాన కార్యదర్శి తాటికొండ ప్రణీత్, సహాయ కార్యదర్శి పొన్నం సురేశ్, బూరుగు యాదగిరి, గూడెం శ్రీధర్ తదితరులను న్యాయమూర్తి రమాదేవి అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగిస్తే ఊరుకోం



సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న అంబేడ్కర్ యువజన సంఘం నేతలు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో దాదాపు 16 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించే యత్నాలు జరుగుతున్నాయని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట నుంచి ముండ్రాయి మీదుగా ఎల్కతుర్తి వరకు కొనసాగుతున్న హైవే రోడ్డు విస్తరణ, నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని పూర్తిగా తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఐదు గ్రామాలకు కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించవద్దని కోరారు. ఇందుకు మాజీమంత్రి హరీశ్‌రావుతో పాటు మండల బీఆర్ఎస్ నాయకులు బాధ్యత వహించి విగ్రహాన్ని అదే స్థలంలో ఉంచి సర్కిల్ ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

సమావేశంలో సమావేశంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి మరియన్న, జిల్లా కోఆర్డినేటర్ కల్లాటి సంజీవ్, న్యాయవాది ఎ.బాపురావు, ప్రజాయుద్ధనౌక గద్దర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాన్ని పట్టించుకోరా?



లింగుపల్లిలో నేలను తాకుతున్న విద్యుత్తు వైర్లు

మిరుదొడ్డి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా నేలను తాకేలా వేలాడుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండలంలోని లింగుపల్లి గ్రామస్థులు మండిపడుతున్నారు. ఈ కారణంగా వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. మండలంలోని లింగుపల్లి గ్రామంలో కిచెన్ గంగయ్య వ్యవసాయ పొలంవద్ద విద్యుత్ వైర్లు నేలను తాకుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్తు వైర్లు సరిచేయాలని కోరుతున్నారు.

రేషన్ షాపుల్లో మోదీ ఫొటో పెట్టాలి



జాలిగాం రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు

కోహెడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రేషన్ షాపులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగాం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కోహెడలో విలేకరులతో మాట్లాడారు. గత ఆరేళ్లగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ప్రస్తుతం సన్న బియ్యం కూడా కేంద్రమే సరఫరా చేస్తుందని ఆయన వివరించారు. గతంలో కేసీఆర్ సర్కార్ ఒక కేజీ బియ్యానికి ఒక్క రూపాయి మాత్రమే చెల్లించి మేమే ఇస్తున్నామంటూ గొప్పలు చెప్పుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రతి రేషన్ షాపుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో మాదిరిగానే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోహెడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ కోరారు. మంగళవారం మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన గోపగోని సుభాష్‌గౌడ్ ఇటీవల తాడిచెట్టుపై నుంచి పడి గాయాలు కావడంతో ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తాడిచెట్టు పైనుంచి పడి మృతి చెందిన కార్మికులతో పాటు గాయాల పాలైన వారికి రూ 12 కోట్లు ప్రభుత్వం ఇవ్వవలసి ఉందన్నారు. అదేవిధంగా సేఫ్టీ కిట్లకు మొత్తం గీతా కార్మికులకు అందజేయాలనుకుంటే రూ.200 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంటుందని, కానీ కేవలం రూ. 60 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి రూ వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లకు పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన వెంట ఇప్పలపల్లి అనంతరాములు, బీఎస్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల శంకర్, కోహెడ మాజీ అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు మంద మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న కాటం మల్లేశం

చేర్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణానికి చెందిన ఉడుగుల పూర్ణితకు ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిసాయం మంజూరైంది. ఈ మేరకు చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం మంగళవారం రూ.37,500 విలువైన చెక్కును లబ్ధిదారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడాల నాగరాజు, ఒగ్గు మల్లేశం, వెలుగల దుర్గయ్య, ఎర్రమైసగల్ల గణేశ్, తాటిపాముల పరశు రాములు పాల్గొన్నారు.

ఆలయ భూముల రక్షణకు కలిసిరావాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు అన్నివర్గాలు కలిసి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్న ఆలయ భూముల పరిరక్షణకోసం తాము ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశామని, కానీ గత ఈవో బాలాజీ శర్మ భూములు పరిరక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఆయా భూములను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ ప్రయత్నిస్తు ఆలయాధికారులను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఆలయ భూములరక్షణకు పార్టీలకతీతంగా కలిసిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, తాడూఇ మల్లేశం, బక్కెల్లి బాలకిషన్ పాల్గొన్నారు.

చేపల చెరువులతో ఆదాయం



లద్నూరులోని జమ్మికుంటలో ఫిష్‌పాండ్ పనులను పర్యవేక్షిస్తున్న టీఏ

మద్దూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న చేపల చెరువుల నిర్మాణాలతో ఆర్థికంగా బలోపేతం కావచ్చునని ఈసీ పరశురాములు సూచించారు. మండలంలోని లద్నూరు, రేబర్తి గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో కమ్యూనిటీ ఫిష్‌పాండ్ నిర్మాణాలు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో ఫిష్‌పాండ్ నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.10 లక్షలపైనే ఖర్చు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం లద్నూరులోని జమ్మికుంటలో చేపడుతున్న ఫిష్‌పాండ్ నిర్మాణ పనుల వేగవంతానికి కూలీలకు టీఏ వెంకటమ్మ పలు సూచనలు చేశారు. కమ్యూనిటీ ఫిష్‌పాండ్ నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందిస్తున్నట్లు తెలిపారు. ఫిష్‌పాండ్ నిర్మాణాలను ముదిరాజ్‌లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పీల్డు అసిస్టెంట్ పరశురాములుతో పాటు వందకు పైగా కూలీలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త మోకిల్ల రజినీకాంత్‌రెడ్డి కుటుంబాన్ని మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. వెంట మండల పార్టీ అధ్యక్షులు అన్నసారం సురేష్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురాజు రాజు, మండల నాయకులు తదితరులున్నారు.

మహనీయుల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహనీయులైన దొడ్డి కొమురయ్య, బాబు జగ్జీవన్‌రావ్, జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అస్తారు గళ్ల బాలరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లో వారు మాట్లాడుతూ మహనీయులను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మెదక్ మండల అధ్యక్షుడు చెవిటి గట్టయ్య, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, రంజిత్, శ్రీనివాస్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజాసంక్షేమ ప్రభుత్వం



సిద్దిపేటలో రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న పూజల హరికృష్ణ, అత్తుఇమామ్



కొండపాకలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు



అక్కన్నపేట: రామవరంలో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



తొగుట మండలం కాన్గల్‌లో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు తెల్లరేషన్ కార్డు కలిగియున్న వినియోగదారులకు రేషన్ షాపుల్లో మంగళవారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని, దేశంలోనే తొలిసారిగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత రేవంత్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని కొనియాడారు. సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం రేషన్‌కార్డుదారులకు డీసీఎస్‌వో తనుజ, రెవెన్యూ అధికారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, అత్తుఇమామ్ సన్న బియ్యం పంపిణీ చేశారు. అదేవిధఃగా సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, నారాయణరావుపేట మండలం కేంద్రంలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ రాజేశం, పూజల హరికృష్ణ పాల్గొన్నారు. దుబ్బాకలోని 15వవార్డుతో పాటు తొగుట మండలం కాన్గల్ గ్రామంలో సన్నబియ్యం పంఫిణీ పథకానికి దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అలాగే దుబ్బాక మండలంలోని పెద్దగుండెవెళ్లి, బల్వంతాపూర్ గ్రామాల్లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు పడాల రాములు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో గల రేషన్ దుకాణాల్లో మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లిలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, కొండపాక మండలంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. కొండపాక, దమ్మకపల్లిలో తదితర గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. జగదేవ్‌పూర్‌లోని రేషన్ దుకాణంలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మల్లన్నసాగర్ ముంపు గ్రామం సింగారంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు స్థానిక నాయకులతో కలిసి బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి బియ్యం పంపిణీ ప్రారంభించారు. అలాగే మద్దూరు, కోహెడ మండలాల్లోని ఆయా గ్రామాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారులతో కలిసి బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. కాగా రాయపోల్ మండలంలో మాత్రం సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. ఈ విషయమై రాయపోల్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను సంప్రదించగా బుధవారం ప్రారంభించనున్నట్టు తెలిపారు.